క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం

తుని: స్థానిక కొండవారిపేటకు చెందిన గెద్దం అర్జున్ కిరణా దుకాణంలో 10 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్టు తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ నుంచి అందిన సమాచారం మేరకు కిరాణా షాపులో తనిఖీలు చేసి రేషన్ బియ్యం పట్టుకున్నామన్నారు. పౌర సరఫరా శాఖ అధికారులు, తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చామన్నారు. రేషన్ బియ్యం అమ్మినా, కొనుగోలు చేసినా చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వర్క్‌షాపులతో సామర్థ్యాల పెంపు

గండేపల్లి: విద్యార్థుల్లో సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించేందుకు వర్క్‌షాప్‌లు ఎంతగానో దోహదపడతాయని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఏపీఎస్ఎస్ డీసీ సహకారంతో ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ కంప్యూటింగ్‌పై ఐదు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సాఫ్ట్‌వేర్, వివిధ రియల్ టైమ్ అప్లికేషన్లపై అవగాహన, విద్యార్థులు సాంకేతిక సామర్థ్యం పెంచుకునేందుకు ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థకు చెందిన జె.లోవరాజు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీన్ జీడీ వెంకటేష్, వి.సత్యనారాయణ, సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు పోడియం బహూకరణ

రౌతులపూడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా పోడియాన్ని పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చిన్ని బాల బాలాజీ బహూకరించారు. అనకాపల్లి జిల్లా నాతవరం మండలం సరుగుడు గ్రామానికి చెందిన తన మామయ్య పెనుగొండ వెంకటరమణ జ్ఞాపకార్థం పాఠశాలకు పోడియాన్ని అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం కోళ్ల రాంబాబు, ఎస్ఎంసీ ప్రతినిధులు ఈ పోడియాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి



ఏలేరు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్, సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

కిర్లంపూడి: మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే, టీడీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోట రవి అధ్యక్షతన శనివారం మండల బడ్జెట్ సమావేశం నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ శాఖల్లో జరిగిన పలు అభివృద్ధి పనుల పురోగతి, భవిష్యత్‌లో చేపట్టే పనులపై అధికారులతో చర్చించారు. విద్యుత్, వ్యవసాయం, ఆర్‌అండ్‌బీ రోడ్లు, ప్రమాదకరంగా మారిన బ్రిడ్జిలు తదితర సమస్యలను ప్రజాప్రతినిధులు లేవనెత్తారు. అనంతరం ఏలేరు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన బస్వా వీర బాబు, డీసీలు, డబ్ల్యూఏ, టీసీలను శాలువా, గజమాలలతో ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, ఎంపీడీఓ హెచ్. హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సంక్రాంతి కానుకలు



ప్రత్తిపాడులో విద్యార్థులకు కానుకలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరెడ్డి, గీతావాణి దంపతులు

ప్రత్తిపాడు: నిరుపేద విద్యార్థులకు ప్రత్తిపాడు సదా మీ సేవ (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సంస్థ సంక్రాంతి కానుకలు అందించింది. పెద్ద పండగను పురస్కరించుకుని పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లతో పాటు దుస్తులు, వారి తల్లులకు చీరలు, మధ్యాహ్న భోజనాన్ని అందించింది. ప్రత్తిపాడు బజారు వీధి రామాలయం వద్ద శనివారం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, షిర్డీ సాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాస రెడ్డి, గీతావాణి దంపతుల చేతుల మీదుగా వీటిని విద్యార్థులు, తల్లిదండ్రులకు అందజేశారు. అంతర్జాతీయ ఛాయాచిత్ర అవార్డు గ్రహీత సలాది కృష్ణ, ఎస్ఎంఎస్ ప్రతినిధులు గొండేసి సత్యానందం, భేరి రాంబాబు, జాజి మొగ్గల జగదీశ్వరి, లక్ష్మి పాల్గొన్నారు.

3,600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఏలేశ్వరం గ్రామ శివారులో సారా స్థావరాలపై శనివారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన సుమారు 3,600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులతో పాటు కాకినాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ వింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కష్టాల పాడి.. కొండెక్కిన సబ్సిడీ

- రాయితీపై పశువుల దాణా సరఫరాను నిలిపివేసిన ప్రభుత్వం
- భారంగా మారిన పశువుల పెంపకం
- ఆందోళన చెందుతున్న పాడిరైతులు
- ప్రోత్సాహకాలు కొనసాగించాలని డిమాండ్

తొండంగి: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాడి రైతులను పోత్సహించింది. పాల ధరలను పెంచడంతో పాటు వారికి పలు పోత్సాహకాలను అందించింది. కాగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రోత్సాహకాలు, సబ్సిడీలను నిలిపివేస్తూ పాడి పరిశ్రమను నిర్వీర్యం చేస్తోంది. పాడి రైతులకు రాయితీపై అందించే పశువుల దాణా(సమీకృత దాణా) పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో పశువులను మేపడం భారంగా మారుతుందని పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సుమారు రెండు లక్షల వరకూ పాడి పశువులుండగా తొండంగి మండలంలో 26 వేల పశువులు ఉన్నాయి. వీటిలో 11 ఆవులు, 15 వేల పాడి గేదెలు ఉన్నట్టు మండల పశువైద్యాధికారి బి.చైతన్య తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో ప్రోత్సాహకాలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాడి రైతులకు అండగా నిలిచింది. పాల ఉత్పత్తిని పెంచడంతో పాటు పశువులకు పోషకాహారం అందించేందుకు సమీకృత దాణాను ప్రభుత్వం రాయితీపై పాడి రైతులకు సరఫరా చేసేది. 200 కిలోల సమికృత దాణా–టోటల్ మిక్స్‌డ్ రేషన్ (టీఎంఆర్) బస్తా ధర మార్కెట్‌లో రూ.3160 ఉండగా సుమారు 58 శాతం రాయితీ రూ.1860 పోగా రూ.1300కే రైతులకు అందించారు. అలాగే రైతులకు గడ్డి కోత యంత్రాలను రాయితీపై సరఫరా చేశారు. గడ్డి కోత మెషీన్ ధర రూ.33970 ఉండగా 40 శాతం రాయితీ రూ.13588 మినహా రూ.20382కే రైతులకు అందజేశారు. గడ్డి విత్తనాలను 75 శాతం రాయితీపై సరఫరా చేశారు. కాగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం గడ్డి విత్తనాలు పథకాన్ని మాత్రమే కొనసాగిస్తోంది. పశువుల దాణా పథకాన్ని గత ఆరు నెలలుగా నిలిపివేసింది. ప్రభుత్వం సబ్సిడీ దాణా పథకాన్ని నిలిపివేయడంతో గ్రామాల్లో పాడి రైతులు పశువులను పెంచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పాడి రైతులకు అందించే ప్రోత్సాహకాలను కొనసాగించాలని కోరుతున్నారు.

ఎండు గడ్డి ధరలకు రెక్కలు

గతంలో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వరి పంటను సంప్రదాయ పద్ధతిలో కూలీలతో కోత కోయించి పనలపై వారం రోజులు ఆరిన తర్వాత ట్రాక్టర్లతో నూర్పిడి చేసేవారు. ఈ విధానంతో రైతులకు కావలసినంత ఎండు గడ్డి లభించేది. ప్రస్తుతం వరికోత యంత్రాల రాకతో ఎండు గడ్డికి గిరాకీ పెరిగింది. మెషన్‌తో కోత కోసిన గడ్డి పశుగ్రాసానికి పనికి రాదు. దీంతో ట్రాక్టర్ ఎండుగడ్డి ధర రూ.15 వేలు వరకూ పలుకుతోంది.



గోపాలపట్నంలో పాడి రైతులకు రాయితీపై టీఎంఆర్ దాణా సరఫరా చేస్తున్న అధికారులు (ఫైల్)

సమీకృత దాణా కోసం వినతులు



సమీకృత దాణా కోసం పాడి రైతుల నుంచి వినతులు వస్తున్నాయి. వచ్చిన దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపించాం. ప్రభుత్వం పథకంపై ఎటువంటి మార్గదర్శకాలు ఇవ్వలేదు. పథకాన్ని అమలు చేస్తే సమీకృత దాణాను రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

– బి.చైతన్య, మండల పశువైద్యాధికారి, తొండంగి

గతంలో రాయితీపై దాణా ఇచ్చారు



మాది గోపాలపట్నం గ్రామం. గతంలో మాకు నాలుగు పశువులు ఉండేవి. దాణా రాయితీపై తీసుకుని పశువులకు పెట్టేవాళ్లం. కొద్ది నెలలుగా ప్రభుత్వం పశువుల దాణాను సరఫరా చేయడం లేదు. పశువుల పెంపకంగా భారంగా మారుతుంది. ప్రస్తుతం మూడు పశువులు మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వం రాయితీపై సమీకృత దాణాను అందిస్తే పాడిరైతులకు భారం తగ్గుతుంది.

– యడ్ల చంటి, పాడిరైతు, గోపాలపట్నం, తొండంగి మండలం

డ్రోన్‌తో కషాయం పిచికారీ

గోకవరం: మండలంలోని కొత్తపల్లిలో 30 ఎకరాల వరి పొలానికి డ్రోన్ సహాయంతో వేప గింజల కషాయం పిచికారీ చేశారు. ప్రకృతి వ్యవసాయం అడిషనల్ డీపీఎం మహబూబ్ వలీ ఆధ్వర్యంలో పోతుల సత్తిబాబుకు చెందిన 10 ఎకరాల ప్రకృతి వ్యవసాయ క్షేత్రంతో పాటు మరో 20 ఎకరాల్లో వరి పంటకు డ్రోన్ ద్వారా కషాయం పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో డ్రోన్లతో కషాయాలు పిచికారీ చేస్తున్నట్టు తెలిపారు. డ్రోన్ వినియోగంతో సమయం, ఖర్చు ఆదా అవుతాయన్నారు. ప్రకృతి సాగు చేస్తున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

గండేపల్లి: మండలంలోని సింగరంపాలెంలో రైతులకు శనివారం ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డీజీఎం ఏఎస్ ప్రకాష్ ఆయిల్ పామ్ సాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, అధిక దిగుబడులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

మార్కెట్ ప్రదర్శన

జగ్గంపేట: మండలంలోని మల్లిపాకలో అంగన్‌వాడీ చిన్నారులకు విద్యతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించేందుకు శనివారం కూరగాయల మార్కెట్ తరహా ప్రదర్శన నిర్వహించారు. జగ్గంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో విద్యార్థులకు కూరగాయల అమ్మకాలు, కొనుగోళ్లు, నాణ్యత పరిశీలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్. అమ్మాజీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీటీ కేబుల్ ఎండీకి వంగా గీత పరామర్శ



త్రిమూర్తిస్వామిని పరామర్శిస్తున్న వంగా గీత, యనమల కృష్ణుడు, వైఎస్సార్ సీపీ నాయకులు

తుని రూరల్: పుత్ర వియోగంతో బాధపడుతున్న సీటి కేబుల్ ఎండీ చోడిశెట్టి త్రిమూర్తిస్వామిని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత, పలువురు నాయకులు శనివారం పరామర్శించారు. గురువారం త్రిమూర్తిస్వామి తనయుడు హేమశంకర్ (37) గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఎస్.అన్నవరంలోని తన నివాసంలో త్రిమూర్తి స్వామిని వంగా గీత, వైఎస్సార్ సీపీ నాయకులు యనమల కృష్ణుడు, పోల్నాటి శేషగిరిరావు, పోతల రమణ, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంట్ల చక్రరావు తదితరులు పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, ఆదర్శ కాలేజీ ఎండీ అనుబాబు, తుని పట్టణ, రూరల్ సీఐలు గీతా రామకృష్ణ, జి.చెన్నకేశవ రావు, తదితరులు త్రిమూర్తిస్వామిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం



ఏలేశ్వరంలో మిడ్డే మీల్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

గోకవరం/జగ్గంపేట: నియోజకవర్గంలోని జగ్గంపేట, గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కాగా ఇప్పటివరకూ మధ్యాహ్న భోజన పథకాన్ని పదో తరగతి వరకే అమలు చేస్తుండగా శనివారం నుంచి ఇంటర్ విద్యార్థులకూ అందిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి, సొసైటీ మాజీ చైర్మన్లు గాజింగం సత్తిబాబు, దాసరి తమ్మన్నదొర, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు పాల్గొన్నారు.

కిర్లంపూడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ ప్రారంభించారు. ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఏలేశ్వరం: విద్యార్థులు మిడ్డే మీల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కళాశాలల్లో మిడ్డే మీల్స్‌ను ప్రారంభించిందన్నారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాంట్రాక్ట్ లెక్చరర్లు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మన్సిపల్ కౌన్సిలర్లు బోదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, మామిడి లలిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకోవాలి



సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, అధికారులు

ఏలేశ్వరం: విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం చైల్డ్ పోక్స్ చట్టం –2012పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ చదువుకున్న విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులపై లైంగిక వేధింపులు పాల్పడే వారికి కోర్టు విధించే శిక్షలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు వేధింపులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, ఎంఈఓ అబ్బాయి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన



బాల్యవివాహాల నివారణపై గోపాలపట్నంలో అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

తొండంగి: మండలంలోని గోపాలపట్నంలో ప్రజలకు శనివారం బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన ద్వారా బాల్య, మేనరిక వివాహాల వలన కలిగే అనార్థాలను వివరించారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరిగితే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో సాంబయ్య కళాబృంద సభ్యులు కామాక్షి, రాజ్‌కుమార్, విలేజ్ హెల్త్ అసిస్టెంట్ వానపల్లి శ్రీదేవి, ఆశావర్కర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 13 దరఖాస్తులు

తొండంగి: మండలంలోని కోదాడలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రైతుల నుంచి 13 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. మ్యుటేషన్లు, పట్టాదారు పాసు పుస్తకాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరు తదితర అంశాలపై దరఖాస్తులు అందాయని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజారావు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ

జగ్గంపేట: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై శనివారం సామాజిక తనిఖీ జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రశేఖర్ అధ్యక్షతన శనివారం తనిఖీ నిర్వహించారు. మండలంలోని 696 పనులకు గాను వేతనాల రూపంలో రూ 8,05,40,749, మెటీరియల్ రూపంలో రూ 2,73,06,771, మొత్తం రూ 10,78,25,606 ఖర్చు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో స్టేట్ రీసోర్స్ పర్సన్ టి.నందిని, ఈఓపీఆర్డీ భాస్కర్, ఏపీఓ కృష్ణంరాజు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కలిసి పని చేద్దాం

- మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిరిబాబు



శంఖవరంలో మాజీ ఎమ్మెల్యే పర్వత బాపనమ్మను కలసిన ముద్రగడ పద్మనాభం, గిరిబాబు

శంఖవరం: క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కలిసి పని చేద్దామని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్రగడ గిరిబాబు అన్నారు. శంఖవరంలో మాజీ ఎమ్మెల్యేలు పర్వత బాపనమ్మ, పర్వత పూర్ణ చంద్రప్రసాద్, ఎంపీపీ పర్వత రాజుబాబును శనివారం వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు అవకాశం ఇచ్చారన్నారు. నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రణాళికబద్ధంగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. పార్టీలోని నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పని చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గౌతు స్వామి, గొల్లపల్లి కాశీ విశ్వనాథం,పెంటకోట నాగు బాబు, రాపేటి పెద్ద తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



వేళంగిలో బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నేత మురళీ కృష్ణంరాజు

శంఖవరం: మండలంలోని వేళంగి, పి.మల్లాపురం గ్రామాల్లోని బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ నేత, ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ మురళీకృష్ణంరాజు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల ప్రమాదంలో గాయపడిన వీర్ని వెంకటరావు, పెయ్యాల అప్పారావు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున నగదు, బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. అలాగే ఇటీవల ప్రమాదంలో మరణించిన బలుం సుబ్రహ్మణ్యం, బోడోజు వెంకటరమణ కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు గుండు నాగదేవి, మేకల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ఎడమ కాలువ పరిశీలన



చేపూరు వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువను పరిశీలిస్తున్న ఎస్ఈ యేసుబాబు

తుని రూరల్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 6, 7 తేదీల్లో పోలవరం ప్రాజెక్టు ఛీప్ ఇంజినీర్ పర్యటన ఉండడంతో ఎడమ ప్రధాన కాలువను శనివారం సూపరింటెండెంట్ యేసుబాబు పరిశీలించారు. ప్రధానంగా తుని మండలంలో తాండవ నదిపై నిర్మిస్తున్న ఆక్విడెక్టు, అందుకోసం తరలించాల్సిన కుమ్మరిలోవ కాలనీవాసుల పునరావాస ప్రాంతాన్ని సీఈ పరిశీలించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎస్ఈ యేసుబాబు చేపూరు నుంచి తాండవ ఆక్విడెక్టు వరకు ఉన్న పోలవరం ఎడమ ప్రధాన కాలువను పరిశీలించారు. పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, ఇప్పటికే జంగిల్ క్లియరెన్స్ పూర్తి చేసినట్టు తెలిపారు. కాంట్రాక్టు సంస్థను ఆర్‌వీఆర్‌కు మార్పు చేసినట్టు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పోలవరం కాలువలో నీటి ప్రవాహం మొదలయితే ఈ ప్రాంతంలో భూగర్భ జలాల్లో మార్పు వస్తుందని ఈఈ గోవిందు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈలు, ఏఈలు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రెయిలీ లిపితో అంధులకు చూపు

- ఘనంగా ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం

తుని రూరల్: లూయిస్ బ్రెయిలీ రూపొందించిన లిపితో ఎంతోమంది అంధ విద్యార్థులకు పరోక్షంగా చూపు లభించిందని మండల విద్యాశాఖ అధికారి పరవాడ గీతాదేవి అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో శనివారం ప్రపంచ బ్రెయిలీ డే నిర్వహించారు. తొలుత లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ చూపులేని వారికి బ్రెయిలీ కనిపెట్టిన లిపితో కొత్త జీవితం లభిస్తుందన్నారు. చదువుతో పాటు ఉన్నతంగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 రామకృష్ణ, ఐఆర్‌పీ ఎన్.నాగేశ్వరరావు, ఐఈఆర్‌పీ ఎం.రాంబాబు, ఎన్.శ్రీనివాసు, హెచ్ఎం సూకరత్నం, భవిత స్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగులు

కోటనందూరు: అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి లూయిస్ బ్రెయిలీ అని ఎంఈఓ ఏవీఎస్ శ్రీనివాస్ కొనియాడారు. స్థానిక నాన్‌భవిత కేంద్రంలో శనివారం ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు, భవిత సిబ్బంది ర్యాలీ నిర్వహించి అంధుల జీవితాలపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసు మాట్లాడుతూ వైకల్యం శరీరానికి మాత్రమేనని, మనసుకు కాదన్నారు. దివ్యాంగ చిన్నారులను వారి ప్రతిభ ఆధారంగా ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు సాధిస్తారని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎంవీఆర్ శేఖర్, హెచ్ఎం రామకృష్ణ, సీఆర్పీ శేఖర్, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.



తుని భవిత కేంద్రంలో లూయిస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు



గోకవరం భవిత కేంద్రంలో బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

రౌతులపూడి: స్థానిక భవిత కేంద్రంలో శనివారం ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం నిర్వహించారు. ఐఈఆర్‌టీ సిబ్బంది శ్రీనివాస్, అప్పారావు, కోటవీధి పాఠశాల హెచ్ఎం ఎన్. సింహాచలం ఆధ్వర్యంలో లూయి బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భవిత కేంద్రంలో శిక్షణ పొందుతున్న విభిన్న ప్రతిభావంతులను సత్కరించారు. కార్యక్రమంలో దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గోకవరం: స్థానిక దాసరి వారి వీధిలోని భవిత కేంద్రంలో శనివారం ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బ్రెయిలీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఐఈఆర్పీ టీచర్ ఎస్తేరు రాణి విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, కేక్‌లు అందజేశారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం భవిత కేంద్రంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత లూయిస్ బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంధుల అభ్యున్నతికి బ్రెయిలీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.ఎ ద్రయ్య, కుమార్ రాజా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సంక్రాంతి క్రీడా పోటీలు



జగ్గంపేటలో క్రీడా పోటీలకు హాజరైన బాలికలు

జగ్గంపేట: సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంప్రదాయ క్రీడా పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి ప్రతిరోజు 400 నుంచి 600 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. ఇప్పటివరకూ బాలికల జూనియర్స్ విభాగంలో త్రోబాల్, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించినట్టు జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తెలిపారు. త్రోబాల్‌కు 14 టీంలు, కబడ్డీకి 22 జట్లు, వాలీబాల్‌కు 18 జట్లు వచ్చినట్టు చెప్పారు. బాలికల సీనియర్స్ విభాగంలో పోటీలు శనివారం నుంచి ప్రారంభయ్యాయన్నారు. పోటీల్లో గ్రామీణ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటుతున్నారని తెలిపారు.

ప్రయాణంలో జాగ్రత్తలు పాటించాలి



గండేపల్లిలో ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ

గండేపల్లి: ప్రయాణంలో జాగ్రత్తలు పాటించాలని సీఐ వైఆర్కే శ్రీనివాస్ సూచించారు. గండేపల్లిలో శనివారం ప్రమాదాల నివారణపై ఆటోల యజమానులు, డ్రైవర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్ సీట్‌కు ఇరువైపులా ఎవరినీ కూర్చోబెట్టుకోరాదన్నారు. హైవేపై ప్రయాణించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహన రికార్డ్సుతో పాటు డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.